రా.. రమ్మని..

కార్తీక మాసం ప్రారంభమవడంతో సందర్శకులను రా.. రమ్మని ఇందిరాగాంధీ జూ పార్కు పిలుస్తోంది. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఆనందంగా గడిపేందుకు వన్య ప్రపంచం సిద్ధమైంది. సాధారణంగా ఈ సీజన్‌లో జూ పార్కు రద్దీగా ఉంటుంది. ప్రతి రోజూ వేలాది మంది సందర్శకులతో కళకళలాడుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని జూ **అధికారులు సందర్శకులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు.**


ఇందిరాగాంధీ జూ పార్కు

కార్తీక మాసానికి సిద్ధమైన జూ పార్కు
- ఈ సీజన్‌లో నగరవాసులతో కళకళ
- సందర్శకులకు ప్రత్యేక సదుపాయాలు
- అలరిస్తున్న కొత్త వన్యప్రాణులు

ఆరిలోవ: జూ పార్కులో సందర్శకుల కోసం అనేక నూతన సౌకర్యాలు కల్పించారు. ఇక్కడ గతంలో ఉన్న సౌకర్యాలను మరింత మెరుగు పరుస్తూ అధికారులు చర్యలు చేపట్టారు. అవసరమైన కొన్నింటికి మరమ్మతులు చేశారు. వాటితోపాటు గతేడాది కార్తీక మాసం సమయంలో లేని కొత్త వన్యప్రాణులను ఇప్పుడు సందర్శకుల కోసం ప్రత్యేక ఎన్‌క్లోజర్లలోకి విడిచిపెడుతున్నారు. అవి సందర్శకులను అలరిస్తున్నాయి. పగోడాలు, ఆర్వో వాటర్ ప్లాంట్లు, ట్యాప్‌లు, బెంచీలు, రచ్చబండలు, బ్యాటరీ వాహనాలు, సైకిళ్లు, విశాలమైన రోడ్లు తదితర సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. సందర్శకులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా వైద్య సేవలు, పోలీస్ సేవలు, ఆర్టీసీ సేవలు అందుబాటులో ఉంచడానికి ఆయా శాఖల అధికారులను జూ అధికారులు సంప్రదించారు.


జూలో ఎటు వెళ్లాలో తెలియజేసే బోర్డులు

9 ఆర్వో ప్లాంట్లు



జూలో ప్రస్తుతం 9 ఆర్వో ప్లాంట్లు ఉన్నాయి. వాటిలో నాలుగు ప్లాంట్లను ఇటీవల అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇవి జూ ప్రధాన ద్వారం, సాగర్ గేటు, తెల్లపులులు, బయోస్కోప్, జూ కొలను, నెమళ్ల జోన్ తదితర చోట్ల ఉన్నాయి. 30కి పైగా వాటర్ ట్యాప్‌లు వివిధ చోట్ల అందుబాటులో ఉన్నాయి.

29 పగోడాలు



జూలో సందర్శకులు సేదదీరడానికి వీలుగా 29 చోట్ల పగోడాలు(విశ్రాంతి షెల్టర్లు) నిర్మించారు. మరో 9 చోట్ల రచ్చబండలు ఏర్పాటు చేశారు. జూలో పెద్ద చెట్ల చుట్టూ సిమెంట్ దిమ్మలు నిర్మించి సందర్శకులు కూర్చునేందుకు వీలుగా ఏర్పాటు చేశారు.

107 బెంచీలు



జూలో అన్ని ఎన్‌క్లోజర్ల సమీపంలో సందర్శకులు సౌకర్యవంతంగా కూర్చొనేలా సిమెంట్, రాతి బెంచీలు అందుబాటులో ఉన్నాయి. వివిధ చోట్ల 107 బెంచీలు ఏర్పాటు చేశారు.

20 బ్యాటరీ కార్లు



జూ పార్కుకు వెళ్లిన సందర్శకుల్లో నడవలేని వృద్ధులు, పిల్లలకు, వేగంగా వన్యప్రాణులను చూడాలనుకునే వారికి 20 బ్యాటరీ కార్లు, మరో 20 బ్యాటరీ సైకిళ్లు అందుబాటులో ఉన్నాయి. బ్యాటరీ కారుకు మనిషికి రూ.70, సైకిల్ గంటకు రూ.50 టికెట్ తీసుకోవాలి.

కొత్త వన్యప్రాణులు



జూ పార్కుకు ఈ ఏడాది కొన్ని కొత్త జాతులకు చెందిన వన్యప్రాణులను అధికారులు తీసుకొచ్చారు. రెడ్‌నెక్ట్ వాల్లబీ, మీర్‌క్యాట్, స్పైరల్ మంకీస్, మార్మోసెట్స్, స్కార్లెట్ మకావ్, ఆఫ్రికన్ పేరెట్స్ తదితర జాతులను గుజరాత్, కోల్‌కతా జూ పార్కుల నుంచి ఇక్కడికి తీసుకొచ్చి, వాటి కోసం ప్రత్యేకంగా ఎన్‌క్లోజర్లు నిర్మించారు. వాటిలో ఉన్న కొత్త వన్యప్రాణులు సందర్శకులను అలరిస్తున్నాయి.


జంతువుల సమాచారం తెలిపే బోర్డు

'కార్తీకం'లో ప్రత్యేక సేవలు

కార్తీక మాసం సందర్భంగా సందర్శకులకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నాం. ఆర్టీసీ బస్‌లు జూ పార్కు వద్ద ఆపేందుకు ఆర్టీసీ అధికారులతో సంప్రదించాం. అన్ని రోజులు వైద్య సేవలు అందుబాటులో ఉంచేందుకు డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేశాం. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, జూలో ఎలాంటి సంఘటనలు జరగకుండా రక్షణ చర్యల కోసం నగర పోలీస్ కమిషనర్‌ను కోరాం.

– జి.మంగమ్మ, జూ ఇన్‌చార్జి క్యూరేటర్

క్లుప్తంగా

కంబాలకొండలో దీపాలు, మతాబులు వెలిగించొద్దు

ఆరిలోవ: నాగులచవితి సందర్భంగా మంగళవారం కంబాలకొండ ఎకో టూరిజం పార్కుకు వచ్చిన భక్తులు పుట్టల వద్ద దీపాలు వెలిగించకూడదని అటవీ శాఖ విశాఖ రేంజ్ ఆఫీసర్ శాస్త్రి తెలిపారు. ఇక్కడ సహజసిద్ధమైన పుట్టలు ఎక్కువగా ఉన్నాయని, ఎంతమంది భక్తులు వచ్చినా వాటి వద్ద పూజలు చేసుకోవడానికి వీలుపడుతుందన్నారు. పుట్టల వద్ద పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేయించామని చెప్పారు. నాగన్న పూజలకు వచ్చిన భక్తులు పార్కు లోపలకు మతాబులు తీసుకురావడాన్ని నిషేధించామన్నారు. వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్ ప్రకారం లోపల బాణసంచా కాల్చడంతోపాటు పుట్టల వద్ద దీపాలు, అగరవత్తులు వెలిగించడాన్ని నిషేధించినట్లు స్పష్టం చేశారు. ఆయా నిబంధనలను ఉల్లంఘించిన వారు వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్ ప్రకారం శిక్షార్హులవుతారని హెచ్చరించారు. ఈ విషయాన్ని భక్తులు గమనించాలని రేంజ్ ఆఫీసర్ శాస్త్రి కోరారు.

'స్వీయ చరిత్ర' పుస్తక బహూకరణ


ఏయూ వీసీ శశిభూషణరావుకు పుస్తకాన్ని బహూకరిస్తున్న రైటర్స్ అకాడమీ ప్రతినిధులు

విశాఖ సిటీ: మాజీ మంత్రి గల్లా అరుణకుమారి రచించిన తన స్వీయ చరిత్ర పుస్తకాన్ని రైటర్స్ అకాడమీ ప్రతినిధులు సోమవారం ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావుకు అందజేశారు. అల్లూరి సీతారామరాజు కళాక్షేత్రంలో రైటర్స్ అకాడమీ నిర్వాహకుడు రమణమూర్తి చేతుల మీదుగా ఈ పుస్తకావిష్కరణ జరిగింది. ఏయూ తెలుగు విభాగానికి, గ్రంథాలయానికి ఉపయోగంగా ఉంచాలని రైటర్స్ అకాడమీ ప్రతినిధి మేడా మస్తాన్‌రెడ్డి, అమర్ రాజా సంస్థల ప్రతినిధి ఎల్.మహదేవ నాయుడు ఏయూ వీసీకి ఈ పుస్తకాన్ని బహూకరించారు. ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు పాల్గొన్నారు.

ప్రజా రవాణాతో కాలుష్య నియంత్రణ


ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి వస్తున్న మేయర్ హరివెంకటకుమారి

డాబాగార్డెన్స్: వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా విశాఖ నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. ఆమె తన క్యాంపు కార్యాలయం నుంచి జీవీఎంసీకి సోమవారం ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో కమిషనర్ సంపత్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ యంత్రాంగం వారంలో ఒక రోజు ప్రజా రవాణాను వినియోగించే నిర్ణయం మేరకు జీవీఎంసీ ఉద్యోగులతో పాటు అందరం ప్రజా రవాణాను వినియోగిస్తున్నామన్నారు.

లాసెన్స్ బే కాలనీలో ఫాగింగ్


ఫాగింగ్ చేస్తున్న మలేరియా సిబ్బంది

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 20వ వార్డు లాసెన్స్ బే కాలనీలో కార్పొరేటర్ ముచ్చల లక్ష్మి సురేష్ ఆదేశాల మేరకు మలేరియా విభాగం సిబ్బంది ఫాగింగ్ నిర్వహించారు. ద్విచక్ర వాహనంపై లాసెన్స్ బే కాలనీ, బాల భవన్ పార్క్ ప్రాంతాల్లో దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

హిందీ విభాగ విద్యార్థులకు యార్లగడ్డ ఆర్థిక సాయం


చెక్కు అందజేస్తున్న యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం హిందీ విభాగం విద్యార్థులు ఈ నెల 27 నుంచి డిసెంబర్ 3 వరకు విజ్ఞాన యాత్రకు వెళ్లనున్నారు. వీరికి ఖర్చుల నిమిత్తం ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ రూ.లక్ష అందజేశారు. సోమవారం ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు చేతుల మీదుగా విభాగాధిపతి ఆచార్య ఎస్.సత్యనారాయణకు ఆ చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆచార్య లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ విజ్ఞాన యాత్రను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. వారణాసిలోని ప్రముఖ దర్శనీయ స్థలాలు, అక్కడ జన్మించిన కవులు, వారి ప్రాముఖ్యతను వివరించారు. ఆగ్రాలో హిందీ సంస్థాన్‌ను సందర్శించి అక్కడ అందిస్తున్న సేవలు, హిందీ భాషాభివృద్ధికి జరుగుతున్న కృషిని ప్రత్యక్షంగా తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థులు సందర్శించే ప్రతి ప్రాంతంలో హిందీ భాషకు సంబంధించిన అభివృద్ధి, వికాసం, సాహిత్యం తదితర అంశాలపై క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ నరసింహారావు మాట్లాడుతూ విభాగంలో ఆచార్యుడి నుంచి జాతీయ స్థాయిలో హిందీ భాషకు విశేష సేవలందించి నేటికీ విశ్వ కళామతల్లికి నిరంతరం సేవ చేస్తున్న లక్ష్మీప్రసాద్ విభాగానికి విలువైన సంపదగా అభివర్ణించారు. విద్యార్థుల విజ్ఞాన యాత్రకు ఆర్థిక సాయం అందించడం అభినందనీయమన్నారు. విభాగాధిపతి సత్యనారాయణ మాట్లాడుతూ విభాగంలో జరిగే ప్రతి కార్యక్రమానికి యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తన వంతు సహకారం అందిస్తున్నారన్నారు. మీడియా రిలేషన్స్ డీన్ ఆచార్య చల్లా రామకృష్ణ, విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏయూ వీసీని కలిసిన ఏబీవీపీ నాయకులు


వీసీ శశిభూషణరావుకు మొక్క అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య జి.శశిభూషణరావును సోమవారం ఏబీవీపీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, యూనివర్సిటీకి సంబంధించిన పలు అంశాలను వీసీ దృష్టికి తీసుకువెళ్లారు. ఏబీవీపీ ఇటీవల రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన విశ్వవిద్యాలయాల సదస్సులో చర్చించిన విషయాలను ఆయనకు వివరించారు. విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండే అంశాలతో వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర విశ్వవిద్యాలయాల కన్వీనర్ జి.కిరణ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జి.సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

మిద్దెతోటలపై అవగాహన


ఏయూ సోషల్ వర్క్ విద్యార్థులకు మిద్దెతోట వివరాలు తెలియజేస్తున్న కేఎం రావు

ఎంవీపీకాలనీ: స్థానిక ఉషోదయ కూడలి దరి బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఇంజినీర్ కేఎం రావు మిద్దెతోటను సోమవారం ఆంధ్ర విశ్వవిద్యాలయం సోషల్ వర్క్ విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా కేఎం రావు మిద్దె తోట పంటల వివరాలను వారికి తెలియజేశారు. కొన్నేళ్లుగా అక్కడ పండిస్తున్న పంటలు, పెంపకం విధానం, సంరక్షణ వివరాలను వెల్లడించారు. గాంబియాకు చెందిన ఏయూ సోషల్ వర్క్ విద్యార్థిని ఆడమ్ బి సార్ మాట్లాడుతూ ఇంటి పెరటిలో, మిద్దెల్లో పండించే కూరగాయలే మనకు ఆరోగ్యాన్ని అందిస్తాయన్నారు. ప్రతి ఇంట్లో ఇలాంటి విధానం అవలంబించాల్సిన అవసరముందన్నారు. ప్రకృతి ఆధారిత పంటలపై ప్రస్తుతం ఆసక్తి పెరుగుతోందని చెప్పారు. ఈ దిశగా జరుగుతున్న ప్రయత్నాల విశ్లేషణ, ఇతరులకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా స్వచ్ఛంద సంస్థలతో కలిసి ఏయూ సోషల్ వర్క్ విభాగం పని చేస్తున్నట్లు తెలిపారు. ఎకో వైజాగ్‌లో భాగంగా మిద్దెతోటలు అధికంగా పెంచాలని సూచించారు. కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ కార్యదర్శి జేవీ రత్నం, పలువురు సోషల్ వర్క్ విద్యార్థులు పాల్గొన్నారు.

కంబాలకొండలో చేతివృత్తుల స్టాల్


ఆరిలోవ: పర్యాటక ప్రాంతమైన కంబాలకొండ ఎకో టూరిజం పార్కులో చేతివృత్తుల వస్తువుల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. కార్తీక మాసం కావడంతో ఎక్కువ మంది సందర్శకులు ఈ పార్కును సందర్శిస్తారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఇక్కడ స్టాల్‌ను ఏర్పాటు చేసినట్లు రేంజర్ శాస్త్రి తెలిపారు. ఈ స్టాల్‌లో వెదురుతో తయారు చేసిన గ్లాసులు, కొబ్బరి చిప్పలతో తయారు చేసిన టీ గ్లాసులు, కర్రతో చేసిన కీ చైన్‌లు, క్లాత్ బ్యాగులు, అల్లికలతో కూడిన టీ షర్టులు, తదితర వస్తువులను విక్రయిస్తున్నారు. సందర్శకులు వీటిని ఆసక్తిగా తిలకించి కొనుగోలు చేస్తున్నారు.


వివిధ రకాల వస్తువులు


స్టాల్‌లో వస్తువులు కొంటున్న సందర్శకులు

హర హర మహాదేవ

భక్తిశ్రద్ధలతో కార్తీక మాసం తొలి సోమవారం పూజలు


లలితా పీఠంలో శివలింగానికి అభిషేకం


పెదగదిలి శివాలయంలో పూజలు చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి


శివాజీనగర్-2 శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


కొత్త వెంకోజీపాలెం ఆలయంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న అర్చకుడు


పూజలందుకున్న లింగేశ్వరుడు

ఆరిలోవ: శివాలయాల్లో కార్తీక మాసం పూజలు మొదలయ్యాయి. మొదటి సోమవారం ఆరిలోవ ప్రాంతంలోని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. భక్తులు వేకువజాము నుంచి ఆలయాలను సందర్శించి శివ పూజలు చేశారు. ఆరిలోవ కాలనీలోని ఆపరేషన్ కాలనీ, శివాజీనగర్-2, నెహ్రూనగర్, డ్రైవర్స్ కాలనీ, పెదగదిలి, హనుమంతవాక, విశాలాక్షినగర్, ఆదర్శనగర్, రవీంద్రనగర్, కైలానగర్‌ల్లో శివాలయాల్లో భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయాల ముందు ధ్వజ స్తంభాల వద్ద కార్తీక దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో కొలిచారు.

శివయ్యకు మేయర్ పూజలు

జీవీఎంసీ 12వ వార్డు పెదగదిలి శివాలయంలో స్వామిని మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు మేయర్‌కు సాదర స్వాగతం పలికారు. అర్చకులతో ప్రత్యేక పూజలు చేయించారు. పూజల అనంతరం మేయర్ ఆలయం ఆవరణలో భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. 13వ వార్డు శివాజీనగర్ శివాలయంలో స్వామిని కార్పొరేటర్ కెల్ల సునీత కుటుంబ సభ్యులతో దర్శించుకొని పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

మద్దిలపాలెం: కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. కొత్త వెంకోజీపాలెంలోని జ్ఞానానంద ఆశ్రమం దేవదాయ ధర్మాదాయ శాఖ శ్రీ గౌరీ జ్ఞాన లింగేశ్వరాలయంలో ప్రాతః కాలం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. పీతలవానిపాలెం, హెచ్‌బీ కాలనీలోని శివాలయాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అభిషేకాలు నిర్వహించారు. మహిళలు ధ్వజ స్తంభం, రాగి చెట్టు, తులసి కోట వద్ద దీపారాధనలు చేశారు. ఎంఎంటీసీ కాలనీ త్రిమూర్తిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో అధిక సంఖ్యలో భక్తులు పూజలు చేశారు. సాయంత్రం ధ్వజ స్తంభం వద్ద ఆకాశజ్యోతులు వెలిగించారు. ఇసుకతోట, కేఆర్ఎం కాలనీ శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ధ్వజ స్తంభాల వద్ద దీపాలు వెలిగించారు.

పులకించిన భక్తజనం

ఏయూక్యాంపస్: కిర్లంపూడిలోని లలితా పీఠంలో సుందరేశ్వర స్వామికి భక్తుల స్వహస్తాలతో ప్రత్యేక రుద్రాభిషేకాలు జరిపారు. చినవాల్తేరు కనకదుర్గ ఆలయంలోని శివయ్యను పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని అభిషేకాలు చేశారు. బీచ్ రోడ్డులోని కాళీమాత ఆలయంలో రసలింగేశ్వరునికి భక్తులు అభిషేకాలు నిర్వహించారు.

భక్తులకు ప్రసాదం పంపిణీ

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డు పీతలవానిపాలెంలోని రామలింగేశ్వర ఆలయం వద్ద భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ ప్రారంభించి భక్తులకు ప్రసాదం అందజేశారు.


శివయ్య అభిషేకంలో పాల్గొన్న భక్తులు


పీతలవానిపాలెం శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు


ప్రసాదం అందజేస్తున్న పీతల గోవింద్

'ప్రజా సమస్యలు తక్షణమే పరిష్కరించాలి'


ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జెడ్సీ శివప్రసాద్

సీతమ్మధార: ఆశీలమెట్టలోని జీవీఎంసీ జోన్-3 కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ నాలుగు ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులు పరిశీలించి తక్షణమే సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారం సమాచారాన్ని సంబంధిత ఫిర్యాదుదారులకు ఎప్పటికప్పుడు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గంగాధర్, ఏసీపీ మధుసూధనరావు, యూసీడీ విభాగం అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎల్.రాము, సిబ్బంది పాల్గొన్నారు.